క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ఇదే గ్రామానికి చెందిన కీశేలు పెద్దనర్సిరెడ్డి, గురమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి మనువడు నుసి వెంకటసేనారెడ్డి రూ.50వేల విరాళం ఇచ్చారు. మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, అర్చకులకు విరాళాన్ని అందజేశారు. దాతను పూలమాలతో సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

మంచినీటి పంప్‌హౌస్‌లో ఆయుధ పూజ

డోన్: పట్టణంలోని పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకం పంపుహౌస్‌లో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్ మంగళవారం ఆయుధ పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సక్రమంగా మంచినీటి సరఫరా జరిగేలా చూడాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ రఘు, ఏఈ సురేష్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో ప్రైవేటు వ్యక్తులదే హవా

డోన్: మున్సిపల్ పరిధిలో మంచినీటి సరఫరాపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు ఆయా కాలనీల్లో తమకు ఇష్టం వచ్చిన సమయాల్లో నీళ్ల వదులుకుంటున్నారు. మంచినీరు వదిలే సిబ్బంది వాల్వులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పునరావృతం కాకుండా మంచినీరు వదిలే సిబ్బందికి మున్సిపల్ ఉన్నతాధికారులు గట్టి హెచ్చరికలు జారీచేయాలని కోరుతున్నారు.

రాయల శతకం ఆవిష్కరణ

డోన్: మండలంలోని గోసానిపల్లె జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ అనుగోలు సంజీవరాయుడు రచించిన రాయల శతకం పుస్తకాన్ని మంగళవారం తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోని సాహితీవేదికలో ఆవిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయల పాలన విశేషాలు, యుద్ధ నైపుణ్యం, మతసామరస్యం, తెలుగుభాషపై కవి చూపిన ఆసక్తిని తెలుగు పండితులు చక్రవర్తి, రఘునాథశర్మ కొనియాడారు. సహస్రావధాని కడిమిళ్ల వరప్రసాద్, సూరం శ్రీనివాసులు రచయితను సత్కరించారు.

కూలిన మట్టి మిద్దె



బనగానపల్లెలో కూలిన మట్టిమిద్దె

బనగానపల్లె రూరల్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలోని బొమ్మలపీర్ల చావిడి వద్ద ఎస్.అబేద్‌హుస్సేన్ ఇంటి మట్టి మిద్దె మంగళవారం తెల్లవారుజామున కూలిపోయింది. ప్రమాదంలో ఇంట్లోవారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అయితే, ఇంట్లో ఉన్న రూ.50 వేల విలువైన సామగ్రి పాడైపోయిందని బాధితుడు తెలిపారు. వర్షాల ప్రభావంతో మిద్దె తడిసి తెల్లవారుజామున ఒక్కసారిగా కూలిపోయిందని చెప్పారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎల్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: హుసేనాపురం సమీపంలో ఎల్లమ్మ, గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ జరిగి 40 రోజులు కావడంతో గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. అంతకుముందు ఆయన గూటుపల్లె, తవిసికొండ గ్రామాలకు బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటశివుడు, గూటుపల్లె సర్పంచ్ శ్రీరాములు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో జాగ్రత్త

డోన్ టౌన్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. అధిక వర్షాల కారణంగా పాత ఇళ్లు, మట్టి మిద్దెలు, బలహీనమైన గోడలు కూలిపోయే ప్రమాదం ఉందని, అలాంటి ఇళ్లలో నివసిస్తున్న వారు తాత్కాలికంగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని తెలిపారు. గ్రామాల్లో వాగులు, వంకలు, కాలువలు పొంగిపోర్లే అవకాశముండడంతో వాటిని దాటే ప్రయత్నం చేయకూడదని హెచ్చరించారు. ఎక్కడైనా నీరు ముంచెత్తే పరిస్థితులు, ప్రమాద సూచనలు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దీంతో రక్షణ చర్యలు త్వరగా చేపట్టగలమని తెలిపారు. ప్రజల ప్రాణాల కంటే మిన్నది ఏదీ కాదని, కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండి పోలీసుల సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

అరాచకాల అడ్డుకట్టకే డిజిటల్ బుక్

- కార్యకర్తలకు అండగా ఉంటాం
- గ్రామ స్థాయి నుంచి కమిటీల ఏర్పాటు
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు(కొలిమిగుండ్ల): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని..ఈ అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ఏర్పాటు చేశారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మంగళవారం అవుకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డితో కలిసి వివిధ అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. గ్రామాల్లో తమ పార్టీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. దాడులు చేయడంతో పాటు తిరిగి బాధితులపైనే కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అన్యాయం జరిగిందని పోలీస్‌స్టేషన్‌లకు వెళితే పోలీసులు తిరిగి అక్రమ కేసులు బనాయించి చిత్ర హింసలకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు వైఎస్ జగన్ డిజిటల్ బుక్ తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఎవరికి ఎలాంటి అన్యాయం జరిగినా ఇందులో నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చెప్పిన మాయ మాటలు విని ప్రజలు ఓట్లు వేశారని.. ఇప్పుడు దుర్మార్గపు పాలనను చూసి ఎందుకు వేశామని పశ్చాత్తాప పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. గతంలో పంట నష్టం జరిగితే ఎప్పటికప్పుడు నష్టపరిహారాన్ని రైతుల అకౌంట్లలో జమ చేశారని చెప్పారు. అయితే యూరియా కూడా సక్రమంగా అందించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5లక్షల పింఛన్‌లు తొలగించారని చెప్పారు. చాలా మంది అర్హులు ఉన్నా నేటికి ఒక్క కొత్త పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



హాజరైన ముఖ్య నాయకులు

దోపిడీదారులుగా మారిపోయారు

ఎప్పుడూ లేని విధంగా కూటమి పాలనలో ఎమ్మెల్యేలు, మంత్రులు దోపిడీదారులుగా మారిపోయారని ఆరోపించారు. వ్యాపారులు రాజకీయాల్లోకి వచ్చి మంత్రులు కావడంతో ప్రజల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. కార్యకర్తలు కష్టపడి పని చేస్తే భవిష్యత్‌లో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. డిసెంబర్ నెలాఖరు కల్లా గ్రామ స్థాయి నుంచి అన్ని రకాల కమిటీలు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గానికి 8వేల మందితో కమిటీ ఏర్పాటు జరుగబోతుందన్నారు. వీరందరికీ ఐడెంటిటీ కార్డులు జారీ చేస్తారని చెప్పారు. సమాజానికి ఉపయోగపడేలా సోషల్ మీడియా పని చేయాలని కోరారు. నాయకులు గోపవరం గోపాల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, తల్లం సుబ్రమణ్యం, మంచాల నాగేశ్వరరెడ్డి, పురుషోత్తం, వాయునందన్‌గౌడ్, నర్సిరెడ్డి, తులసిరెడ్డి, నారాయణరెడ్డి, పుల్లారెడ్డి, రామిరెడ్డి, హరి, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వికృత ఆనందం పొందుతున్నారు

అధికారంలో ఉన్నామని ఏది చేసినా చెల్లుతుందని అధికార పార్టీ నాయకులు వికృత ఆనందం పొందుతున్నారని.. ఎల్లకాలం రోజులు ఒకేలా ఉండవనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని చల్లా విఘ్నేశ్వరరెడ్డి అన్నారు. డిజిటల్ బుక్‌లో మొదటి బాధితుడిని తానే అని గుర్తు చేశారు. కార్యకర్తలకు అన్యాయం జరిగితే అండగా నిలబడుతామని భరోసా ఇచ్చారు. కూటమి పాలనలో జరిగిన ప్రతిదీ గుర్తు పెట్టుకొని తిరిగి ఇస్తామన్నారు. కార్యకర్తల సహకారం అవసరమన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బనగానపల్లె: గ్రామస్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని కాటసాని రామిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తన స్వగృహంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీలను త్వరలో పూర్తి చేస్తామని, డిసెంబరు 15నాటికి పార్టీ గుర్తింపు కార్డులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కూటమి నేతలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, వారికి సహకరించే అధికారులను కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పార్టీ శ్రేణులపై జరుగుతున్న అన్యాయాలను క్యూర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరూ తప్పక వైఎస్ జగన్ 2.0ను చూస్తారని అన్నారు. పార్టీ నాయకులు అత్తార్ జావేద్‌హుస్సేన్, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అబ్దుల్‌ఫైజ్, అబ్దుల్‌ఖైర్, నీలి శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, ఖానిక్, కృష్ణ, జగదీశ్వరరెడ్డి, నాగరాజు, సురేష్, సజ్జాద్ తదితరులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో మాట్లాడుతున్న కాటసాని రామిరెడ్డి

చౌడేశ్వరిదేవి సేవలో కాటసాని

బనగానపల్లె: దుర్గాష్టమి సందర్భంగా నందవరం చౌడేశ్వరిదేవిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి కుంకుమార్చన, అభిషేకం చేయించి తీర్థప్రసాదాలు అందించారు.



ఆలయ ప్రాంగణంతో కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు

వాసవీమాతను దర్శించుకున్న అర్జున్‌రెడ్డి



బుగ్గనకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆర్యవైశ్యులు

బేతంచెర్ల: స్థానిక అమ్మవారిశాలలోని వాసవీ మాతను మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆర్యవైశ్యులు స్వాగతం పలికారు. వాసవీమాతకు పూజల అనంతరం పూలమాలలు, మెమెంటో అందజేసి సత్కరించారు. అలాగే సంజీవనగర్, హనుమాన్‌నగర్, వడ్డెపేట కాలనీల్లోని అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గత వారం వివాహమైన వైఎస్సార్‌సీపీ నాయకుడు పటాన్ హబీబ్ ఖాన్ కుమార్తెను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, అధికార ప్రతినిధి మురళీకృష్ణ, కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, జాకీర్ హుసేన్, నాయకులు గూని నాగరాజు, శేఖరయ్య, సూర్య, జశ్వంత్ రెడ్డి, సలీం, ఖాజా పాల్గొన్నారు. అలాగే డోన్‌లోని పలు ఆలయాలను సందర్శించారు.

ఉద్యోగులను విస్మరించడం దారుణం

డోన్ టౌన్: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించారని, కనీసం దసరా పండుగ కానుకగా డీఏ ప్రకటించాలని యూటీఎఫ్ నాయకుడు అబ్దుల్ లతీఫ్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో పురోగతి లేదన్నారు. ఇప్పటికే 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, నిత్యావసర ధరల పెరుగుదల దృష్ట్యా డీఏ వెంటనే ప్రకటించాలని కోరారు. కాగా ప్యాపిలి జెడ్పీ బాలుర పాఠశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు 2025 డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ప్యాపిలి మండల అభ్యర్థులకు అభినందన సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు రమేష్‌నాయుడు, సర్వజ్ఞమూర్తి, అమీర్‌బాషా, సాలయ్య, విజయ్ చార్లెస్, మద్దయ్యనాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లతీఫ్

పోలీస్‌స్టేషన్‌లో ఆయుధపూజ

సంజామల: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. ఎస్‌ఐ రమణయ్య ఆధ్వర్యంలో స్టేషన్‌లోని ఆయుధాలకు, దుర్గామాత చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాముడు, నాగరాజు, లక్ష్మీనారాయణ, సరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- కోవెలకుంట్ల: దసరా ఉత్సవాల్లో దుర్గాష్టమిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో స్టేషన్‌లోని ఆయుధాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు మద్దిలేటిరెడ్డి, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



ఆయుధ పూజ చేస్తున్న ఎస్‌ఐ రమణయ్య

అతివేగంతోనే అధిక ప్రమాదాలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ

ప్యాపిలి: వాహన చోదకులు అతివేగంతో వాహనాలను నడపడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ మధుసూదన అన్నారు. స్థానిక బనగానపల్లె క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు తమ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్సుతో పాటు వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులు సక్రమంగా కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపడం, అతివేగంతో వాహనాలను నడపడం ప్రమాదకరం అన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

బనగానపల్లె రూరల్: ఆశా వర్కర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వేదవతి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆశా వర్కర్ల సమావేశం జరిగింది. ఆశా వర్కర్లకు బీమా, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలు కల్పించకపోవడం అన్యాయం అన్నారు. కరోనా కాలంలో ప్రాణాలు కోల్పోయిన ఆశా వర్కర్ల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా, అంత్యక్రియల ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

కోవెలకుంట్ల: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు కరీం బాషా అన్నారు. రాజ్యాంగంలోని లౌకిక సామ్యవాద పదాలను తొలగించే కుట్రకు నిరసనగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు కలిసి రాజ్యాంగ పీఠికలోని లౌకిక, సామ్యవాద పదాలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ కుట్రను తిప్పికొట్టేందుకు ఈ నెల 9న విజయవాడలోని ధర్నా చౌక్‌వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. న్యాయవాది సాంబశివుడు, ఆయా సంఘాల నాయకులు రెడ్డిపల్లె ఓబయ్య, కోకిల ప్రసాదు, వెంకటసుబ్బయ్య, నరసింహులు, నాగయ్య పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్యాపిలి: జలదుర్గం గ్రామంలోని కొత్తకొట్టాలు కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం కాలనీలో పర్యటించారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. నాయకులు ఖాజా హుసేన్, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

కోవెలకుంట్ల: పట్టణంలోని మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న భవన సముదాయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ మండలస్థాయి కార్యకర్తల సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి తెలిపారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, అన్ని అనుబంధ విభాగాల కన్వీనర్లు, సభ్యులు, సోషల్ మీడియా కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

బేతంచెర్ల: ప్రమాద సమయంలో క్షతగాత్రులకు చేసే రక్తదానం ప్రాణదానంతో సమానం అని బీజేపీ డోన్ నియోజకవర్గ కన్వీనర్ రమణ, జిల్లా కార్యదర్శి నాగమోహన్, పట్టణ కన్వీనర్ గుండా అశ్వర్థ నారాయణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓల్డ్ పోలీస్ క్వార్టర్స్ సమీపంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన పక్షోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. పట్టణ యువకులు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు రక్తదానం చేశారు. గ్రూప్ దేవాలయాల చైర్మన్ మారుతి కృష్ణ, మాజీ చైర్మన్ గుండా జగన్ మోహన్ రావు, మత సామరస్య చైతన్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు నూర్ అహ్మద్, గౌస్ పాల్గొన్నారు.

బనగానపల్లెలో 30.8 మి.మీ వర్షపాతం

బనగానపల్లె: మండలంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు భారీ వర్షం కురిసింది. 30.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అక్టోబర్ 1 నుంచి రబీ సీజన్ ప్రారంభవుతున్నందున జొన్న పంట వేసేందుకు సిద్ధంగా ఉన్న రైతులకు వర్షాలతో ఇబ్బందిగా మారింది. సాగులో ఉన్న మిరప, పత్తి, మొక్కజొన్న పంటలకు కూడా చీడపీడలు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కెమికల్ ఫ్యాక్టరీలతో కాలుష్యం

డోన్ టౌన్: పట్టణ పరిసరాల్లోని కెమికల్, పౌడర్, కంకర ఫ్యాక్టరీల కాలుష్యంతో ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రంగనాయకులు ఆరోపించారు. ఉడుములపాడు కెమికల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్యం సమీప గ్రామాల ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తోందని అన్నారు. అలాగే కోట్లవారిపల్లె, యు.కొత్తపల్లె ప్రాంతాల్లోని ఫ్యాక్టరీల నుంచి దుమ్ము, ధూళి వ్యాప్తి చెందుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కర్నూలు కాలుష్య నియంత్రణ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు.

సీనరేజ్ వసూలుకు రంగం సిద్ధం

- పలు చోట్ల మినీ కంటైనర్లు ఏర్పాటు
- దసరా తర్వాత ప్రైవేట్ సంస్థ చేతుల్లోకి..

కొలిమిగుండ్ల: పలు రకాల ఖనిజాల రవాణాకు సంబంధించి సీనరేజ్ వసూలు చేసే బాధ్యత ప్రైవేట్ సంస్థ చేతుల్లోకి వెళ్లిపోయింది. కొద్ది రోజుల క్రితం కూటమి ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సీనరేజ్ వసూళ్లకు టెండర్లు పిలవడంతో హైదరాబాద్‌కు చెందిన సుధాకర ఇన్‌ఫ్రా సంస్థ టెండర్ కైవసం చేసుకుంది. నాపరాతి గనులు, గ్రానైట్ తదితర ఖనిజాలను క్వారీల నుంచి ఎగుమతి చేసేందుకు ఇప్పటి వరకు భూగర్భ గనుల శాఖ అధికారులు రాయల్టీ వసూలు చేస్తూ వచ్చారు.

టెండర్ దక్కించుకున్న ప్రైవేట్ సంస్థ దసరా పండుగ తర్వాత సిబ్బందిని నియమించుకుని ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాల నుంచి సీనరేజ్ వసూలు చేసేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తోంది. సిబ్బంది ఉండేందుకు ఇప్పటికే బందార్లపల్లె క్రాస్ రోడ్డులో ఉన్న రాయల్టీ చెక్‌పోస్ట్ చెంతనే మినీ కంటైనర్ ఏర్పాటు చేశారు. కొలిమిగుండ్ల మండల కేంద్రం, అవుకు మండలం రామాపురం, బనగానపల్లె మండలంలోని పలుకూరు క్రాస్ రోడ్డు సమీపంలో కంటైనర్‌లు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. బేతంచెర్ల రైల్వే గేట్ సమీపంలో ఇప్పటికే ఏర్పాటు చేశారు.



బందార్లపల్లె క్రాస్ రోడ్డులో రాయల్టీ చెక్‌పోస్టు వద్ద ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేసిన మినీ కంటైనర్

గడ్డు పరిస్థితిలో పరిశ్రమ

అన్ని రకాల ఖనిజాల కంటే బనగానపల్లె నియోజకవర్గంలోని నాపరాయి చాలా తక్కువది. ఇప్పటికే ఈ పరిశ్రమ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. ఎగుమతులు లేక మైనింగ్ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సీనరేజ్ వసూలు ప్రైవేట్ పరం చేయడంతో యజమానులకు పాలుపోవడం లేదు. నాప, పాలీష్ రాళ్ల రవాణా చేసే సమయంలో టన్నుకు ఎంత మేర వసూలు చేస్తారనే విషయంలో ఆందోళన చెందుతున్నారు. టన్నుల ప్రకారం వసూలు చేస్తే కష్టాల్లో ఉన్న నాపరాతి పరిశ్రమ కోలుకోవడం కష్టంగా ఉంటుందని పలువురు యజమానులు పేర్కొన్నారు. వేలాది మంది కార్మికుల కుటుంబాలు ఈపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. ట్రాక్టర్లకు మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకోవాలని మైనింగ్ యజమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జయజయహే మహిషాసురమర్దిని



బేతంచెర్ల: అమ్మవారిశాలలో సామూహిక కుంకుమార్చన,



బేతంచెర్లలో..



కోవెలకుంట్ల: మహిషాసుర మర్దినిగా వాసవీమాత



నందవరంలో మహాదుర్గగా చౌడేశ్వరిదేవి



మద్దిలేటిస్వామి ఆలయంలో దుర్గాదేవిగా..



బనగానపల్లె: మహిషాసురమర్దినిగా కన్యకాపరమేశ్వరి



డోన్ అమ్మవారిశాలలో దుర్గాదేవిగా..



ప్యాపిలి: దుర్గాదేవిగా వాసవీమాత



అమ్మవారిశాలలో నవదుర్గలు



కోవెలకుంట్ల- లింగాల రహదారిలో ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్నవంచెవాగు,



వల్లంపాడు సమీపంలో నల్లవాగు

వాగులకు పోటెత్తిన వరద

- నిలిచిపోయిన రాకపోకలు

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా కోవెలకుంట్ల మండలంలోని వివిధ వాగులకు వరదనీరు పోటెత్తి ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు తోడు మండలంలోని వల్లంపాడు సమీపంలో ప్రవహిస్తున్న కుందూ నదికి భారీగా వరదనీరు చేరడంతో నదికి అనుసంధానంగా ఉన్న నల్ల, చిన్నవంచెవాగులు ఉప్పొంగాయి. కోవెలకుంట్ల- లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలో రాకపోకలు స్తంభించాయి. బిజనవేముల, పెద్దకొప్పెర్ల, చిన్నకొప్పెర్ల, ఎం.గోవిందిన్నె గ్రామాల ప్రజలు లింగాల మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి.